మన
ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
# ప్రజా ప్రతినిధి
ప్రజా ప్రతినిధి NEWS టీ.వి
తెలుగు దినపత్రిక
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :254 మంగళవారం జూలై 7 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

# సాయంత్రం వరకు లెక్కలు రోజు వసూళ్ల బాగోతం


## జగిత్యాల జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో




- జగిత్యాల జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అక్రమాలకు అడ్డా ?
- డాక్యుమెంట్ రైటర్లుమధ్యవర్తులతో అధికారుల కుమ్మక్కు!
- జగిత్యాల జిల్లా నియోజికవర్గ పరిధిలోని రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో అక్రమాల పర్వం కొనసాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.?
- , ఆస్తుల క్రయ-విక్రయాలకు సంబంధించిన ప్రక్రియలో నిబంధనలకు తిలోదకాలు చేస్తూ భారీ వసూళ్లకు పాల్పడుతున్నారన్న విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.?
- డాక్యుమెంట్ రైటర్లతో ముందే కుదిరిన డీల్ మేరకు అధికారులు పనిచేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.!
- రిజిస్ట్రేషన్ కోసం నేరుగా కార్యాలయానికి వెళ్తే పనులు జరగవు, తప్పనిసరిగా ప్రైవేటు మధ్యవర్తులను ఆశ్రయించాల్సిందేనని అప్లికెంట్లు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.?








(తెలంగాణ స్టేట్ బ్యూరో ప్రత్యేక జగిత్యాల జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం)//మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక నిఘాలో భాగంగాఆస్తి విలువను బట్టి వసూళ్లకు దందా..! ఆస్తుల రేట్ల ఆధారంగా వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒక్కరిద్దరు డాక్యుమెంట్ రైటర్లే 'ఆడిందే ఆట, పాడిందే పాట'గా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.! వీరే అధికారులకు అత్యంత సన్నిహితంగా ఉండి, క్రయ-విక్రయాల్లో కీలక పాత్ర పోషిస్తూ పెద్ద ఎత్తున దందాలు సాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.?సాయంత్రం వరకు లెక్కలుడ వసూళ్ల బాగోతం..సమాచారం ప్రకారం, అధికారులు తమ వద్దకు వచ్చిన ప్రతి డాక్యుమెంట్‌ను పరిశీలించి అది ఏ డాక్యుమెంట్ రైటర్ నుంచి వచ్చిందో నోట్ చేసుకుంటారని, అనంతరం 'ఫీజు టు ఫీజు' పేరుతో వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.?ఇందుకోసం ప్రత్యేకంగా నియమించుకున్న ఒక ప్రైవేటు వ్యక్తి సాయంత్రం వేళ డాక్యుమెంట్ రైటర్ల వద్దకు వెళ్లి, వారి పరిధిలో జరిగిన డాక్యుమెంట్ల సంఖ్య ఆధారంగా డబ్బులు వసూలు చేస్తాడని బాధితులు ఆరోపిస్తున్నారు. !ప్రజా ప్రతినిధులతో సన్నిహిత సంబంధాలు?కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు విచ్చలవిడిగా సంపాదిస్తూ, జిల్లాలోని ప్రజాప్రతినిధులకు సన్నిహితంగా ఉంటూ అధికారులపైనే పెత్తనం చేసే స్థాయికి చేరుకున్నారన్న విమర్శలు పరిస్థితి తీవ్రతను సూచిస్తున్నాయి ! దీంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తమవుతోంది.?జిల్లా రిజిస్ట్రార్ పర్యవేక్షణ ఎక్కడ?ఇన్ని ఆరోపణలు వినిపిస్తున్నా, జగిత్యాల జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంపై జిల్లా రిజిస్ట్రార్ అవినీతి నిరోధక శాఖ అధికారుల పర్యవేక్షణ ఏమైందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమాలపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. వేచి చూడండి అతి త్వరలో మీ ముందుకు మరో సంచలనాత్మక కథనంతో మీ మా మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రికలో

మన
ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
# ప్రజా ప్రతినిధి
ప్రజా ప్రతినిధి NEWS టీ.వి
తెలుగు దినపత్రిక
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :254 మంగళవారం జూలై 7 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

# ఖరీఫ్‌కు సన్నద్ధం కావాలి...



- రైతుకు ప్రభుత్వం అండగా నిలవాలి
- విత్తనాల కొరతకు తావివ్వొద్దు
- సాగుకు ముందే భరోసా కల్పించాలి
- క్షేత్రస్థాయిలో పటిష్ఠ పర్యవేక్షణ అవసరం
- రైతు అవసరాలే ప్రభుత్వ ప్రాధాన్యం కావాలి

జులై 6 (మనప్రజాప్రతినిధి) :రాష్ట్రంలో ఖరీఫ్ సాగు ప్రారంభానికి సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సకాలంలో అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వర్షాలు అనుకూలంగా ఉండే అవకాశాల నేపథ్యంలో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉన్నందున రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా జిల్లాల వారీగా అవసరమైన నిల్వలను ముందుగానే సిద్ధం చేయాలి. గతంలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వ్యవసాయ నిపుణులు 2

## కుప్పం అభివృద్ధికి కొత్త దిశ



- మూడు రోజుల పర్యటనపై సీఎం సంతృప్తి
- రూ.9,322 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం
- మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం 2

## విప్‌లకు ప్రత్యేక కార్యాలయాలు



- అసెంబ్లీలో కార్యాలయాల ప్రారంభం
- మంత్రుల శుభాకాంక్షలు
- ప్రజా సేవలో విజయవంతం కావాలని ఆకాంక్ష 2

## ఉన్నత విద్యపై సీఎం సమీక్ష

- సచివాలయంలో సమావేశం
- పథకాల పురోగతిపై చర్చ
- విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి




చెన్నై, జులై 6 (మనప్రజాప్రతినిధి): తమిళనాడు ముఖ్యమంత్రి ఎస్. జోసెఫ్ విజయ్ సోమవారం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యకలాపాలు, సంక్షేమ పథకాల అమలుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. చెన్నైలోని రాష్ట్ర ప్రధాన సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఉన్నత విద్యాశాఖ పనితీరు, ప్రస్తుత పథకాల అమలు, భవిష్యత్ కార్యాచరణపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ఉన్నత విద్యా రంగంలో అమలవుతున్న వివిధ పథకాల పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందించేందుకు చేపడుతున్న కార్యక్రమాలపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని సూచించినట్లు సమాచారం. ఉన్నత విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాల అమలుపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. విద్యార్థులకు మరింత మెరుగైన అవకాశాలు కల్పించే దిశగా శాఖ మరింత సమర్థవంతంగా పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు.విద్యా రంగంలో సాంకేతికత వినియోగం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, పరిశోధనలకు ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో ఉన్నత విద్య కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి విద్యార్థికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యా రంగంలో నాణ్యత పెంపుతో పాటు పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యాశాఖకు చెందిన ఉన్నతాధికారులు, సంబంధిత

## పులిచింతలలో కార్మికుల ఆందోళన

- -ఆత్మహత్యాయత్నంతో ఉద్రిక్తత
- -ఉద్యోగాల కోసం ధర్నా
- -తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్



2

## పర్యాటక ప్రాజెక్టులకు వేగం పెంచండి



- ఎకో టూరిజంపై సీఎం దృష్టి
- పర్యాటక కేంద్రాల అభివృద్ధి
- పెట్టుబడులపై ప్రత్యేక కసరత్తు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2

## బాబు జగ్జీవన్‌రామ్‌కు కేటీఆర్ నివాళి



- తెలంగాణ భవన్‌లో కార్యక్రమం
- చిత్రపటానికి పూలమాల
- సేవలను స్మరించిన నేతలు 2

## హమాలీల సమస్యలు పరిష్కరించడం మా బాధ్యత కేటీఆర్

- రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా
- రైతులకు నీరు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శ
- హమాలీల సంక్షేమానికి బీఆర్ఎస్ కట్టుబడి ఉంటుందని హామీ

హైదరాబాద్, జులై 6 (మనప్రజాప్రతినిధి): హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని మల్లాపూర్‌లో జరిగిన 18వ హమాలీ యూనియన్ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన హమాలీ కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, హమాలీ 3

# ఖరీఫ్‌కు సన్నద్ధం కావాలి...

మెదటి పేజీ తరువాయి



అభిప్రాయపడుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరి, పత్తి, మొక్కజొన్న, కంది, పెసర, మినుము, సోయాబీన్ వంటి ప్రధాన పంటల సాగు పెద్దఎత్తున జరుగుతుంది. ఈ సమయంలో విత్తనాలు లేదా ఎరువుల కొరత ఏర్పడితే రైతుల సాగు ఆలస్యమై దిగుబడులపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. అందువల్ల రైతుల అవసరాలను ముందుగానే అంచనా వేసి, ప్రతి మండలం, గ్రామ స్థాయిలో సరిపడా నిల్వలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ధృవీకరించిన విత్తనాలనే రైతులకు అందించేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరం. ఎరువుల విషయంలో కృత్రిమ కొరత సృష్టించడం, అక్రమ నిల్వలు ఉంచడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలి. యూరియా, డీఏపీ, ఎన్‌పీకే, పొటాష్ వంటి ఎరువులను అవసరానికి అనుగుణంగా అన్ని ప్రాంతాలకు సరఫరా చేసేలా ముందస్తు కార్యాచరణ రూపొందించాలి. మార్కెట్‌లో ఎరువుల లభ్యతపై వ్యవసాయ శాఖ ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రైతులు కూడా గుర్తింపు పొందిన విక్రయ కేంద్రాల నుంచే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలి. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు సంబంధించిన రసీదులు భద్రంగా ఉంచుకోవాలని సూచించాలి. నకిలీ విత్తనాలు లేదా నాణ్యత లేని ఎరువులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించేలా గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. రైతులకు సాంకేతిక సూచనలు అందించడంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మరింత చురుకుగా వ్యవహరించాలి. వాతావరణ మార్పులు, తెగుళ్ల ప్రభావం, మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు అందించాల్సిన అవసరం ఉంది. పంటల ఎంపిక నుంచి కోత వరకు ప్రతి దశలో శాస్త్రీయ సలహాలు అందితే ఉత్పాదకత పెరిగే అవకాశం ఉంటుంది. అలాగే వ్యవసాయ శాఖ, వాతావరణ శాఖ, పరిశోధనా సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి రైతులకు ఖచ్చితమైన సమాచారం అందించాలి. ఖరీఫ్ సీజన్ విజయవంతమైతే రైతుల ఆదాయం పెరగడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు లభిస్తుంది. అందుకే రైతు పొలంలో అడుగుపెట్టే ముందే ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి. విత్తనం నుంచి ఎరువు వరకు, అవగాహన నుంచి మార్కెట్ వరకు ప్రతి అంశంలో రైతుకు అండగా నిలిచి, ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటేనే ఈ ఖరీఫ్ సీజన్ ఆశించిన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది.

# కుప్పం అభివృద్ధికి కొత్త దిశ

మెదటి పేజీ తరువాయి



కుప్పం, జులై 6 (మనప్రజాప్రతినిధి): కుప్పంలో మూడు రోజుల పర్యటన ఎంతో ఉత్సాహంగా, సంతృప్తికరంగా సాగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రశాంతమైన, స్వచ్ఛమైన కుప్పంలో ప్రజలతో మమేకం కావడం కొత్త శక్తినిచ్చిందని పేర్కొన్నారు. ఈ పర్యటనలో అభివృద్ధికి సంబంధించిన పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కంగుంది భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నిర్ణయంతో ఎన్నో కుటుంబాలకు న్యాయం జరిగిందని, భూ సమస్యల పరిష్కారంతో ప్రజల్లో కొత్త నమ్మకం ఏర్పడిందని పేర్కొన్నారు. కుప్పం అభివృద్ధికి ఊతమిచ్చే రూ.9,322 కోట్ల విలువైన 30 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టినట్లు చంద్రబాబు వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. వ్యవసాయం, పౌల్ట్రీ, తయారీ రంగాల్లో కొత్త పెట్టుబడులు రావడానికి ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని వివరించారు. కుప్పాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. “స్వర్ణ కుప్పం“ లక్ష్యంగా మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, వ్యవసాయం, ఉపాధి రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉన్న కుప్పాన్ని అత్యాధునిక వసతులతో కూడిన ప్రాంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చంద్రబాబు అన్నారు. అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో కుప్పం దేశానికే ఆదర్శ నియోజకవర్గంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల సహకారంతో సమగ్ర అభివృద్ధిని సాధించి, కుప్పాన్ని రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందేలా తీర్చిదిద్దుతామని తెలిపారు.

# విప్‌లకు ప్రత్యేక కార్యాలయాలు

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, జులై 6 (మన ప్రజా ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వ విప్‌లుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే వేముల వీరేశంలకు శాసనసభ ప్రాంగణంలో కేటాయించిన ప్రత్యేక కార్యాలయాలను సోమవారం మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారంలో విప్‌లు సమర్థ వంతంగా బాధ్యతలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రత్యేక కార్యాలయాల ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రులు విప్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో శాసనసభ విప్‌ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వం మధ్య సమన్వయ వేదికగా విప్‌లు పనిచేయాలని సూచించారు. శాసనసభలో ప్రజాప్రతినిధుల పనితీరుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని ఈ సందర్భంగా తెలిపారు. ప్రత్యేక కార్యాలయాల ఏర్పాటు వల్ల విప్‌లు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, ప్రభుత్వ కార్యక్రమాల అమలును పర్యవేక్షించడం వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని మంత్రులు విప్‌లకు సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఈ కార్యాలయాలు ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. నూతన కార్యాలయాలను సందర్శించి విప్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలులో విప్‌లు విజయవంతంగా పనిచేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షిస్తూ కార్యక్రమం ముగిసింది.

# పులిచింతలలో కార్మికుల ఆందోళన

మెదటి పేజీ తరువాయి



సూర్యాపేట, జులై 6 (మనప్రజాప్రతినిధి): సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని పులిచింతల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉద్యోగాల నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ ఆర్టిజెన్ కార్మికులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కొందరు కార్మికులు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఆందోళన చేస్తున్న కార్మికులు మాట్లాడుతూ తమను శాశ్వత ఉద్యోగులుగా చేస్తామని హామీ ఇచ్చి ఎన్నో సంవత్సరాలుగా తక్కువ వేతనాలతో పనిచేయించుకున్నారని ఆరోపించారు. కఠిన పరిస్థితుల్లో విధులు నిర్వహించినప్పటికీ ఇప్పుడు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు కోల్పోవడంతో తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని కార్మికులు తెలిపారు. అకస్మాత్తుగా విధుల నుంచి తొలగిస్తే తాము ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నిస్తూ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆందోళన సమయంలో కొందరు కార్మికులు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి యత్నించగా, అక్కడే ఉన్న సహచరులు, అధికారులు అప్రమత్తమై వారిని అడ్డుకున్నారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటనతో విద్యుత్ కేంద్రం పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమను తిరిగి విధుల్లోకి తీసుకోవడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు డిమాండ్ చేశారు. శాశ్వత నియామకాలపై గతంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం, సంబంధిత సంస్థలు అమలు చేయాలని కోరారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఘటనపై సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కార్మికులతో చర్చలు జరిపి సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. పరిస్థితి అదుపులోనే ఉందని, కార్మికుల డిమాండ్లపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు.

# బాబు జగ్జీవన్‌రామ్‌కు కేటీఆర్ నివాళి

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, జులై 6 (మన ప్రజాప్రతినిధి): మాజీ ఉపప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాంతం కృషి చేసిన మహానేత అని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ప్రజాసేవకు అంకితమైన నాయకుడిగా బాబు జగ్జీవన్‌రామ్ దేశ రాజకీయాల్లో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నారని కేటీఆర్ అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, అనంతరం కేంద్ర మంత్రిగా, ఉపప్రధానిగా ప్రజా సంక్షేమానికి ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమని చెప్పారు. ఆయన చూపిన సేవా మార్గం, సామాజిక సమానత్వ భావన నేటి తరానికి స్ఫూర్తినిస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధే నిజమైన ప్రజాస్వామ్యానికి బలమనే సందేశాన్ని బాబు జగ్జీవన్‌రామ్ తన జీవితంతో చాటిచెప్పారని అన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజ సేవలో ముందుండాలని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన విశిష్ట సేవలను గుర్తు చేసుకుంటూ ఆయనకు ఘన నివాళులు అర్పించారు

# పర్యాటక ప్రాజెక్టులకు వేగం పెంచండి

మెదటి పేజీ తరువాయి




హైదరాబాద్, జులై 6 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రంలో చేపట్టిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో పర్యాటక శాఖ పనితీరును సమీక్షించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని అటవీ భూములను వినియోగించి ఎకో టూరిజం ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని సూచించారు. సమావేశంలో సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగర పరిసర ప్రాంతాల్లో కొత్త ఎకో పార్కులను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రకృతి పరిరక్షణతో పాటు పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు చెప్పారు. హైదరాబాద్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను మరింత ఆకర్షణీయంగా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. తారామతి బారాదరి, దుర్గం చెరువును ఆధునిక పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, మంజీరా, దిల్‌కుషా అతిథి గృహాలను ఆధునికీకరించాలని ఆదేశించారు. నగర వారసత్వ సంపదను పర్యాటక అభివృద్ధికి అనుసంధానం చేయాలని సూచించారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యంగా వికారాబాద్‌లోని శ్రీ వీరభద్రస్వామి దేవాలయాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేసి, దేవస్థానానికి ప్రత్యేక పాలక మండలిని ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సీయూఆర్ పరిధిలో అర్బన్ ఫారెస్ట్ నమూనాలో ఎకో టూరిజం ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని సీఎం పేర్కొన్నారు. అలాగే పురానాపూల్ వంటి చారిత్రక వంతెనలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. అవసరమైతే ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించి పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వచ్చే డిసెంబరులో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించాలని, వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ఉన్నతస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు

# ప్రేమ పేరుతో మైనర్ బాలికపై లైంగిక దాడి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష




మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూలై 06,:మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి మెదక్ జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయస్థానం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, తెలిపారు.సోమవారం జిల్లా ఎస్పి మీడియా సమావేశంలో మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా క్రితం చేగుంట పట్టణనికి చెందిన ఆటో డ్రైవర్ రజాక్ (27) పదవ తరగతి చదువుతున్న మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడుతూ, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెపై పలుమార్లు బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం మరో వివాహం చేసుకున్నప్పటికీ, ఆ విషయమై బాలిక ప్రశ్నించగా "నిన్ను కూడా పెళ్లి చేసుకుంటాను" అంటూ మభ్యపెట్టి, తన గురించి ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి చేగుంట ఎస్ఐ కె. సుభాష్ పోక్సో చట్టం ఇతర సంబంధిత సెక్షన్ల కింద 2020 అక్టోబర్లో కేసు నమోదు చేశారు.సోమవారం నాడు మెదక్ జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఆర్.ఎం. శుభవాలి తీర్పు ను ఇస్తూ నిందితుడుకి రజాక్‌కు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా విధించారు. అలాగే బాధితురాలికి రూ.1,00,000 విక్టిమ్ కాంపెన్సేషన్ అందజేయాలని ఆదేశించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు

# భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి




మన ప్రజాప్రతినిధి మనకొండూరు తేదీ 06 జూలై :ఇల్లంతకుంట బిజెపి మండల శాఖ అధ్యక్షుడు భూమల్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు గొప్ప జాతీయవాది, దేశ సమగ్రత కోసం తన జీవితాన్ని అర్పించిన డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమల్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ "ఏక్ దేశ్ మే, దో విధాన్, దో ప్రధాన్ నహి చలేంగే"(ఒక దేశంలో రెండు జెండాలు రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు ఉండరాదు) అన్నారని అన్నారు. జమ్మూ కాశ్మీర్ విలీనం కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన గొప్ప దేశభక్తుడు అని స్పష్టం చేశారు. కాశ్మీర్లో అమలవుతున్న ప్రత్యేక చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుతూ 1953 లో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా జమ్మూ కాశ్మీర్ సరిహద్దుల్లోకి ప్రవేశించిన ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారని అన్నారు.డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ కలలుగన్న సమగ్ర సమైక్య భారతదేశాన్ని నిర్మించడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు. ఆయన ఆశయాలు స్ఫూర్తి వంతమైన జీవితం మనకు ఎల్లప్పుడు మార్గదర్శకం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేశెట్టి శ్రీనివాస్, బిజెపి మండల ఉపాధ్యక్షులు,చింతలపల్లి తిరుపతిరెడ్డి ,కూనబోయిన బాలరాజ్, మండల ప్రధాన కార్యదర్శి పినికాసి అనిల్, కరికె నవీన్ కుమార్, కార్యవర్గ సభ్యులు తుమ్మనపల్లి కమలాకర్ రావు, నాయిని శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం
## జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే
## గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 32 ఫిర్యాదుల స్వీకరణ



మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్ల,జూలై,06:బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, వారికి సత్వర న్యాయం అందించేందుకు ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఎస్పీ గారు నేరుగా ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఈ రోజు మొత్తం 32 ఫిర్యాదులను స్వీకరించినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ... గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం ఉంటుందని, తద్వారా వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించవచ్చని అన్నారు. ఈ రోజు వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరంగా త్వరితగతిన న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.పోలీసులపై నమ్మకం పెంచేలా సేవలు ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఎస్పీ స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది ఎంతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. వినతులను స్వీకరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. అప్పుడే ఫిర్యాదుదారులకు పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతాయని ఉద్ఘాటించారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నామని, అవి ఏ మేరకు పరిష్కారమయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందిస్తామని ఎస్పీ వివరించారు.

# సిరిసిల్లలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



మనప్రజాప్రతినిధి//రాజన్నసిరిసిల్ల, జూలై 06 సిరిసిల్ల పట్టణంలో భారత మాజీ ఉపప్రధాని, నవభారత నిర్మాత బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.దేశ ప్రగతికి బాబు జగ్జీవన్ రామ్ సేవలు అనన్యంఈ సందర్భంగా ముఖ్య అతిథి నాగుల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్ రామ్ రాజకీయ ప్రస్థానం దేశ చరిత్రలోనే చిరస్మరణీయమైనదని కొనియాడారు. బీహార్ రాష్ట్రంలో మొదటిసారి ఎమ్మెల్యేగా, ఆ తర్వాత ఎంపీగా ఎన్నికై, సుదీర్ఘ కాలం పాటు దేశానికి సేవలందించారని గుర్తుచేశారు.ముఖ్యంగా ఆయన కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పనిచేసిన కాలంలో కార్మికుల సంక్షేమం కోసం అనేక చట్టాలు తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా దేశాన్ని ఆహార సంక్షోభం నుండి గట్టెక్కించడంలో, హరిత విప్లవాన్ని విజయవంతం చేయడంలో ఆయన పాత్ర మరవలేనిదన్నారు. భారతదేశాన్ని ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిగా మార్చడానికి ఎంతో కృషి చేశారని, 50 సంవత్సరాల పాటు నిరంతరాయంగా పార్లమెంట్ సభ్యుడిగా సేవలందించి ప్రపంచ రికార్డు సృష్టించారని వారు పేర్కొన్నారు."బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనే మనం వారికి ఇచ్చే నిజమైన నివాళి. కులమత రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నరుతరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులుఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకునూరి బాలరాజు, ఆర్టీఏ మెంబర్ సంగీతం శ్రీనాథ్, మున్సిపల్ కౌన్సిలర్లు కూరపాటి శ్రీశైలం, బొద్దుల శ్రీనివాస్ రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాగుల జగన్, మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు కొలనూరి రమాదేవి, కాంగ్రెస్ నాయకులు కత్తెర దేవదాసు, రాము, మంగ, కిరణ్ లతో పాటు పలువురు

# బస్సు కోసం బారులు... ప్రయాణికులకు నరకయాతన



మన ప్రజా ప్రతినిది తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:ముదిగొండవల్లభి పల్లెవెలుగు మార్గంలో తీవ్ర రద్దీ సరిపోని బస్సులతో మహిళలు, చిన్నారులు, వృద్ధులకు తీవ్ర ఇబ్బందులు.అదనపు సర్వీసులు వెంటనే నడపాలని ప్రజల విజ్ఞప్తి స్పందించాల్సిన ఖమ్మం ఆర్టీసీ అధికారులు.ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలోని ముదిగొండ సెంటర్ నుంచి వల్లభి వైపు వెళ్లే తెలంగాణ ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులు ప్రయాణికుల రద్దీకి ఏమాత్రం సరిపోకపోవడంతో ప్రజలు నిత్యం తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో వందల సంఖ్యలో ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తుండగా, వచ్చిన ఒక్క బస్సులోనే అందరూ ఎక్కేందుకు తోపులాటలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముదిగొండ నుంచి సువర్ణపురం, కష్టాపురం, కమలాపురం, వల్లభి తదితర గ్రామాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, వృద్ధులు ప్రతిరోజూ ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. సరిపడా బస్సులు లేకపోవడంతో చిన్నారులను ఒడిలో పెట్టుకుని, నిల్చునే చోటు కూడా లేక ఇరుకిరుకుగా ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు చెబుతున్నారు. కొన్నిసార్లు బస్సులో కాలు పెట్టే అవకాశం కూడా లేక వెనుదిరగాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని వాపోతున్నారు.ప్రయాణమా... లేక ప్రాణాలపై ప్రయోగమా? ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులను కేటాయించకపోవడం వల్ల ప్రతి రోజు ఒకే బస్సులో సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదం సంభవించే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా రవాణా అంటే భద్రత, సమయపాలన, సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ఆర్టీసీదే అయినప్పటికీ ఈ మార్గంలో ఆ లక్షణాలు కనిపించడం లేదని విమర్శిస్తున్నారు.గ్రామీణ ప్రజలపై నిర్లక్ష్యమా?పట్టణ ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా బస్సులు నడుపుతున్న అధికారులు, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ప్రయాణికుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా అదనపు సర్వీసులు ఏర్పాటు చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.ప్రభుత్వం దృష్టి సారించాలిఉప ముఖ్యమంత్రి, జిల్లా ప్రజాప్రతినిధులు, తెలంగాణ ఆర్టీసీ ఉన్నతాధికారులు ఈ సమస్యపై వెంటనే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. ముదిగొండవల్లభి మార్గంలో ప్రయాణికుల రద్దీని పరిశీలించి ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు పల్లెవెలుగు బస్సులు నడపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజల డిమాండ్లుముదిగొండవల్లభి రూట్‌లో వెంటనే అదనపు పల్లెవెలుగు బస్సులు నడపాలి.పీక్ అవర్స్‌లో ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయాలి.విద్యార్థులు, మహిళలు, వృద్ధులు సురక్షితంగా ప్రయాణించేలా సీట్ల సామర్థ్యానికి అనుగుణంగా సర్వీసులు పెంచాలి.గ్రామీణ ప్రాంతాలకు కూడా సమాన రవాణా సౌకర్యం కల్పించేలా తెలంగాణ ఆర్టీసీ కార్యాచరణ చేపట్టాలి.ప్రజల మాట"ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించడం ప్రభుత్వం, ఆర్టీసీ ప్రాథమిక బాధ్యత. బస్సుల కొరత వల్ల ప్రతిరోజూ వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడటం దురదృష్టకరం. అధికారులు వెంటనే స్పందించి ఈ మార్గంలో అదనపు బస్సులు నడిపి ప్రజల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలి" అని ముదిగొండ మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కూతురును సర్కార్ బడిలో చేర్పించిన సర్పంచ్



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్ :ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా రవీంద్ర నగర్ మహిళా సర్పంచ్ తన కూతురుకు అడ్మిషన్ తీసుకుని ఆదర్శంగా నిలిచారు. వివరాలు ఇలా ఉన్నాయి. రవీంద్ర నగర్ మహిళ సర్పంచ్ కోడెల కవిత రవి తన కూతురు ప్రైవేట్ పాఠశాలను కాదని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ తీసుకున్నారు.అలాగే వార్డు మెంబర్ కుమారుడు నీ కూడా అదే పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ విద్యపై తమకున్న నమ్మకాన్ని చాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ కవిత రవి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో అత్యంత అనుభవజ్యులైన ఉపాధ్యాయులు, సరైన వసతులు ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు ఎవరు ప్రైవేటు స్కూళ్ల మోజులో పడి డబ్బులు వృధా చేసుకోవద్దని సూచించారు.బడిడు పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుండడంతో ప్రజలకు నమ్మకం కలిగించేందుకు తన కూతురిని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించినట్లు ఆమె తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి,ఉప సర్పంచ్ కోడెల కిరణ్, వార్డు మెంబర్స్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# విరసం సభను అడ్డుకోవడం అప్రజాస్వామికం



మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి.భావవ్యక్తీకరణ స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కులో బాగమే.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ పోలీసులు హైదరాబాద్, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగాల్సిన హాల్ మీటింగ్ ను, పర్మిషన్ లేదనే పేరిట జూలై-5 న విరసం సభను అడ్డుకోవడాన్ని సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి తీవ్రంగా ఖండించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగం కల్పించిన భావవ్యక్తీకరణ స్వేచ్ఛను కాలరాయడం అప్రజాస్వామికం అని అన్నారు.హాలులో జరిగే సభలు, సమావేశాలకు కూడ పర్మిషన్ తీసుకోవాలని పోలీసులచేత చెప్పించడం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలోని డొల్లతనం స్పష్టంగా తేటతెల్లం అయ్యిందని మండిపడ్డారు. ప్రజాస్వామ్య దేశంలో బిన్నభిప్రాయాలు, రాజకీయ విశ్వాసాలు కలిగిన వారిని ఉద్దేశ పూర్వకంగా అణిచివేతకు గురిచేసే కుట్రపూరితమైన చర్యలు పౌర, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ, భారత రాజ్యాంగ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని 2026, జూలై-6, సోమవారం రోజు పంపిన ప్రకటనలో షేక్ షావలి పేర్కొన్నారు. తమ నేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా ప్రకటించుకున్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం, అందుకు విరుద్ధంగా రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న కేంద్రం లోని బీజేపీ బడా కార్పొరేట్, సామ్రాజ్య వాద అనుకూల రాజకీయ విధానాలకు వంతపాడడం తమ ద్వంద విధానాలకు పరాకాష్టకు నిదర్శనంగా నిలుస్తాయని అన్నారు. ఇప్పటికైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామిక, ప్రజావ్యరేతక విధానాలకు స్వస్తిపలకాలని, లేనియెడల ప్రజల విశ్వాసాలను, మద్దతును కోల్పోయే ప్రమాదం ఉందని ఈ సందర్భంగా షేక్ షావలి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సూచించారు

# రాష్ట్రపతికి రాయబారుల గుర్తింపు

న్యూఢిల్లీ, జులై 6 (మనప్రజాప్రతినిధి): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆరు దేశాలకు చెందిన కొత్త రాయబారులు, హైకమిషనర్ల నుంచి అధికారిక గుర్తింపు పత్రాలను స్వీకరించారు. అంతర్జాతీయ దౌత్య సంప్రదాయంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం భారత్‌విదేశీ దేశాల సంబంధాల బలోపేతానికి మరో ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మొజాంబిక్, నికరాగువా, సురినామ్, గాబోనీస్ రిపబ్లిక్, మంగోలియా, బహామాస్ దేశాలకు చెందిన ప్రతినిధులు రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలుసుకుని తమ గుర్తింపు పత్రాలను సమర్పించారు. అనంతరం రాష్ట్రపతి వారిని అభినందిస్తూ భారత్‌తో ఆయా దేశాల సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.మొజాంబిక్ గణరాజ్య హైకమిషనర్ ఆర్మాండో పెడ్రో ముయువానే జూనియర్, నికరాగువా రాయబారి నడెస్కా

మన ప్రజా ప్రతినిధి



# అమరుల యాదిలో జీఎంపిఎస్ స్ఫూర్తి యాత్ర

## గుర్జకుంట నంగి రాములు కు ఘన నివాళి




మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల,జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం.గొర్రెలు,మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అమరుల యాదిలో స్ఫూర్తి యాత్ర" లో భాగంగా సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం గుర్జకుంట గ్రామానికి సోమవారం చేరుకుంది, యాత్రకు గ్రామ సొసైటీ సభ్యులు స్వాగతం పలికారు.యాత్ర బృందం గుర్జకుంట గ్రామానికి చెందిన అమరుడు నంగి రాములు,ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించింది.అనంతరం జరిగిన సభలో జిఎంపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కిల్లె గోపాల్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్,మాట్లాడుతూ రాములు ఉమ్మడి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదటి రాష్ట్ర కమిటీ సభ్యులుగా పని చేశారు.మండలంలోని గ్రామాల్లో ఆనాడు గొల్లకురుమలను ఐక్యం చేసి,సొసైటీల నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించారు.ఆయన సేవలు జిఎంపిఎస్.కు ఎంతో ఉపయోగపడ్డాయి అని కొనియాడారు.సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేశారని ఆయన అన్నారు.రాములు స్ఫూర్తితో సంఘాన్ని మరింత ముందు తీసుకోవాలని వారు అన్నారు.ఈ గ్రామంలోని కురుమలు ఇప్పటికీ జిఎంపిఎస్.తోనే ఉన్నారని,ఇక నుండి కూడా ఉండాలని,మన సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉందామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిఎంపిఎస్ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బొల్లం అశోక్, రాష్ట్ర కమిటీ సభ్యులు కడెం లింగయ్య,చల్ల మల్లయ్య,గ్రామ సర్పంచ్ కాసెట్టి పాండు,జిల్లా కార్యదర్శి ఆలేటి యాదగిరి,చేర్యాల మండల అధ్యక్షులు నంగి చంద్రమౌళి,నాయకులు సిద్దులు, మల్లేశం,యాదయ్య, రాములు,మల్లయ్య,నరసయ్య,పోశయ్య,నాగయ్య,మరియు సొసైటీ అధ్యక్షులు ఉపాధ్యక్షులు కుల పెద్ద మనుషులు,గొర్రెల సొసైటీ సభ్యులు,మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కన్న కొడుకును కడతేర్చిన కసాయి తండ్రి అరెస్ట్



మన ప్రజాప్రతినిది తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:కల్లూరు పోలీస్ స్టేషన్ ఖమ్మంచెడు వ్యసనాలకు బానిసయి, వివిధ నేరాలకు పాల్పడుతూ.. పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చిన కొత్తపల్లి సీతారాములు అలియాస్ జాన్ మార్క్ తండ్రి రాములు అలియాస్ రాయప్ప నివాసం అంబేద్కర్ నగర్ కాలనీ కల్లూరు అనే వ్యక్తి ప్రస్తుతం తన వద్ద చెడు వ్యసనాలకు సరిపడ డబ్బులు లేకపోవడంతో అతను కుటుంబంతో సహా ఉంటున్న ఇల్లు అమ్మకానికి బేరాలు తీసుకొస్తుండగా అతని భార్య, కుమారుడు కిరణ్ కుమార్ ఒప్పుకోకపోవడంతో, పలుమార్లు కుమారుడిని ఇల్లు ఖాళీ చేయమని చెప్పినా వినకపోవడంతో, కుమారుడిని చంపితేనే అతడికి ఇల్లు అమ్ముకోవడం వీలు పడుతుందని భావించి, ముందస్తు ప్లాన్ ప్రకారం సదరు నిందితుడు సీతారాములు జులై 3న సాయంత్రం తన కుమారుడిని కల్లూరులో ఉన్న ఒక బెల్ట్ షాప్ కి తీసుకువెళ్లి మద్యం తాపించి మరలా ఇంటికి తీసుకొని వెళ్లి అతను మద్యం మత్తులో గాడ నిద్రలో మంచంపై పడుకొని ఉండగా, సీతారాములు ముందుగా అనుకున్న ప్లాన్ ప్రకారం కిరణ్ కుమార్ తలపై రోకలి బండతో గట్టిగా మోది, గాయపరచగా సదరు కిరణ్ కుమార్ రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుచుండగా, అతడు చనిపోయాడని భావించి సీతారాములు తన యొక్క ఆటోలో అక్కడి నుంచి పరారై, గత రెండు రోజులుగా ఆంధ్రప్రదేశ్లోని తిరువూరు, విస్సన్నపేట ప్రాంతాలలో తిరుగుతూ... సోమవారం కల్లూరు వైపునకు ఆటోలో వస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు అతని కోసం వెతుకుతున్న పోలీస్ బృందం ఈరోజు ఉదయం సమయంలో ముగ్గ వెంకటాపురం గ్రామము వద్ద అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి ఆటో, నేరానికి ఉపయోగించిన రోకలి బండ, కత్తిని మధ్యవర్తుల సమక్షంలో సీజ్ చేసి ముద్దాయిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. తదుపరి ముద్దాయిని రిమాండ్ నిమిత్తం ఎజేసిఎమ్ సత్తుపల్లి వారి వద్ద హాజరు పరుచబడుతుంది. ముత్తులింగం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సత్తుపల్లి రూరల్.

# బాధ్యతతో ప్రజలకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి..





మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక పత్రిక ఖమ్మం :ఖమ్మం .జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పదవి విరమణ పొందిన ఉద్యోగులను ఘనంగా సన్మానించిన జిల్లా కలెక్టర్ జూన్ నెలలో పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఖమ్మంప్రభుత్వ ఉద్యోగం ఒక బాధ్యతతో కూడినదని, బాధ్యతతో ప్రజలకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండ పోతాయని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.సోమవారం కలెక్టరేట్ లో జూన్ 30 నాటికి పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై ఉద్యోగుల సేవలను కొనియాడారు.ఇంటర్మీడియట్ విద్యాశాఖ పరిధిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, పెనుబల్లిలో ప్రిన్సిపాల్గా పనిచేసిన సయ్యద్ యూసుఫ్, రెవెన్యూ శాఖలో తహసీల్దార్గా పనిచేసిన ఎస్.వి. నారాయణమూర్తి, హౌసింగ్ శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్గా పనిచేసిన పి. సాయిరాం రెడ్డి, పశుసంవర్ధక శాఖ పరిధిలో మధిర ఏరియా ఆసుపత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్గా పనిచేసిన ఎస్. చంద్ర భగీరథి దేవి, రెవెన్యూ శాఖలో గిర్దావర్గా పనిచేసిన అల్లం రవికుమార్, విద్యాశాఖలో స్కూల్ అసిస్టెంట్గా పనిచేసిన షేక్ మదార్, ఇంటర్మీడియట్ విద్యాశాఖలో జూనియర్ అసిస్టెంట్గా పనిచేసిన అయూబ్ ఖాన్, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్గా పనిచేసిన కె. వెంకన్న, గిరిజన సంక్షేమ శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేసిన షేక్ హసన్ పాషా, ఆఫీస్ సబార్డినేట్గా పనిచేసిన తేజావత్ పెంటయ్య, జిల్లా ఉపాధి కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ గా పనిచేసిన ఎం. సిద్దిక్ పదవీ విరమణ పొందారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ,లి ప్రభుత్వ ఉద్యోగం ఒక బాధ్యతతో కూడినదని, సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో అంకితభావంతో సేవలందించిన ప్రతి ఉద్యోగి అభినందనీయుడని అన్నారు. 30 నుంచి 40 సంవత్సరాల పాటు ప్రజా సేవలో నిర్విరామంగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతతో ప్రజలకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండి పోతాయని పేర్కొన్నారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి భవిష్యత్ జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కొనసాగాలని కోరుకున్నారు.అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం.కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరూ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని,అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షణ మనందరి బాధ్యత అని జనగామ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె నానిబాబు అన్నారు.సోమవారం రోజున ఆకునూరు గ్రామంలో పలు బూత్ లలో బి ఎల్ ఓ,బి ఎల్ ఎ లతో కలిసి అలాగే గ్రామ పంచాయతీలో హెల్ప్ డెస్క్ ను వినియోగించుకోవాలని,ఓటర్లు వద్దకు వెళ్లి మాట్లాడటం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి వారి వివరాలను పరిశీలించి,అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా,ఓటర్ల వివరాల్లో తప్పులు,పేర్ల తొలగింపులు లేదా ఇతర సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేయించేలా కృషి చేయాలని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన రాజ్యాంగ హక్కు అని,దానిని కాపాడటం ప్రతి కార్యకర్త ధర్మమని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని,ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు కార్యకర్తలు గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకేమో అన్యాయం.. ఉన్నవాళ్లకే ఇందిరమ్మ ఇండ్లు

## అంబేద్కర్ విగ్రహం వద్ద అర్ధనగ్న నిరసన



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,మద్దూరు, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం.పదేళ్లుగా ఇల్లులేక ఇద్దరు పిల్లలతో అల్లాడుతున్నా,ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదనతో ఒక దళిత గ్రామ పంచాయతీ కార్మికుడు సోమవారం మద్దూరు మండల పరిధిలోని లద్నూరు గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద అర్ధనగ్న నిరసనకు దిగాడు.పదేళ్ల క్రితం భార్యను కోల్పోయిన ఆయన ఇద్దరు పిల్లలతో కలిసి తలదాచుకోవడానికి నీడ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సొంత ఇల్లు కోసం గత కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధుల చుట్టూ,అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని వాపోయారు. భూమి,ఇల్లు అన్ని వసతులూ ఉన్నవారికే మళ్లీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నారు.కానీ అర్హత ఉన్న నన్ను పూర్తిగా విస్మరించారు.లంచాలు ఇచ్చుకోలేక,సిఫార్సులు లేక నాలాంటి పేదలు రోడ్డున పడుతున్నారు.అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.చివరకు న్యాయం కోసం ఒంటిపై చొక్కా విప్పేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపారు.తనలాంటి అర్హులైన పేదలకు ఇండ్లు కేటాయించడంలో జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి తనకు ఇల్లు కేటాయించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఆయన నిరసన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

# ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీలో వేగం పెంచాలి




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా:సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని, ప్రతి ఇంటికీ ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై కలెక్టరేట్లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. హరితహారంలో భాగంగా ఇచ్చే మొక్కలు అన్ని రకాలు ఉండేలా చూడాలని, ప్రజలు నాటుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా ఊరూరా పచ్చదనం పరుచుకోవాలని పిలుపునిచ్చారు. అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. కేవలం మొక్కలు నాటడమే కాదు.. వాటిని కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పంచాయతీ రాజ్, మున్సిపాలిటీలు, అటవీ శాఖ, వ్యవసాయం, నీటి పారుదల శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఖాళీ ప్రదేశాలు ఎక్కడ ఉన్నా మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలన్నారు. స్కూళ్లలో పండ్ల మొక్కలు, హాస్టళ్లలో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించేలా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్ పరిసరాల్లో ఎకో క్లబ్ లను యాక్టివేట్ చేసి మొక్కల సంరక్షణ బాధ్యతను అప్పగించాలని సూచించారు. కేవలం ప్రభుత్వ కార్యాలయాలే కాకుండా పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు, పరిశ్రమలు కూడా ఈ వనమహోత్సవంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఇండస్ట్రీ మేనేజ్మెంట్ తమ పరిసరాల్లో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ చేపట్టాలని స్పష్టం చేశారు. మొక్కలు నాటడంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మొక్కల పంపిణీకి సంబంధించి మున్సిపల్ అధికారులు ముందస్తు ప్లానింగ్తో ఉండటంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. పోస్టర్లు, ప్రచార చిత్రాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న తీరు బాగుందని మెచ్చుకున్నారు. ఇదే ఉత్సాహంతో క్షేత్రస్థాయిలో పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.కార్యక్రమం లో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జడ్.పి. సిఇఓ శిరీష, హౌసింగ్ పిడి సిద్ధార్థ్, డిఎంహెచ్ఓ వెంకటరమణ డిపిఓ యాదగిరి, సిపిఓ కిషన్, డిఎఓ శ్రీధర్ రెడ్డి, డిఎఫ్ ఓ దామోదర్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు ఖమ్మం ప్రజావాణిలో ప్రజలు సమర్పించే దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిశీలించి, పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును సానుకూల దృక్పథంతో పరిశీలించి, అర్హత ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఖమ్మం అర్బన్ మండలం 15వ డివిజన్కు చెందిన సయ్యద్ రహమత్ బీ తాను అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నానని, సొంత ఇంటి స్థలం కూడా లేదని, డబుల్ బెడ్రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ కు పంపిస్తూ, నిబంధనల మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.తిరుమలాయపాలెం మండలానికి చెందిన భానురేఖ టేకులపల్లి మహిళా ప్రాంగణంలో ఏఎన్ఎం కోర్సు పూర్తి చేసినప్పటికీ, ఏఎన్ఎం సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ విషయంలో అధికారులు స్పందించడం లేదని దరఖాస్తు సమర్పించగా, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి విచారించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.నేలకొండపల్లి మండలం రెవెన్యూ గ్రామానికి చెందిన లక్కం వెంకన్న, బక్కయ్య, శ్రీనివాస్ లు సర్వే నంబర్లు 993లో 23 గుంటలు, 616లో 15 గుంటలు, 1004లో 12 గుంటలు, 1005లో 12 గుంటల భూమి ఉందని, సాధా బైనామా కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ పాస్ పుస్తకాలు అందలేదని తెలపగా, సంబంధిత తహసీల్దార్కు పంపిస్తూ విచారించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామానికి చెందిన వంగర రమాదేవి తన కుమార్తెకు కళ్యాణలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు కాలేదని తెలపగా సంబంధిత తహసీల్దార్కు పంపిస్తూ అర్హత మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు

# మారేపల్లిలో... పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి



- గ్రామ సర్పంచ్ వడ్డగోని సరస్వతి లక్ష్మయ్య, గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎస్కే సైధాం ఆధ్వర్యంలో పలు కుటుంబ సభ్యులను
- పరామర్శించిన ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి.
బిహాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి మండల పార్టీ నాయకులు
- మృతి చెందిన కుటుంబాలకు ఆర్థిక సహాయం, అండగా ఉంటానని భరోసాఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి..
- గ్రామానికి సంబంధించిన సమస్యలపై గ్రామ సర్పంచ్ తో చర్చ



**అనుముల, జులై 6(మనప్రజాప్రతినిధి):** అనుముల మండలం మారేపల్లి గ్రామంలో పలు కుటుంబ సభ్యులు మరణించారు. మారేపల్లి గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గౌరవ అధ్యక్షులు మెండే ఏడుకొండలు గారి యొక్క తల్లి మారెమ్మ గారు మరణించారు.ఈ విషయం గ్రామ సర్పంచ్ వడ్డగోని సరస్వతి లక్ష్మయ్య మరియు గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎస్కే సైదా ద్వారా సాగర్ శాసనసభ్యులు కుందూరు జై వీర్ రెడ్డి విషయం తెలుసుకొని హుటా హుటిన చేరుకొని, భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అంజలి ఘటించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గండు వెంకటేశం అనారోగ్యంతో ఇటీవల మరణించారు వారి కుటుంబ సభ్యుల దగ్గరికి వెళ్ళి చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేశారు. బుధవారం మహంకాళి మహంకాళి అంజయ్య (కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు) తన కుమార్తె అయిన మహంకాళి హిందూ అకస్మాత్తుగా మరణించింది. మృత్యురాలు కుటుంబ సభ్యుల దగ్గరికి వెళ్లి ఆమె చిత్రపటానికి పుష్పమాలవేసి నివాళులర్పించి అంజలి ఘటించి కుటుంబ సభ్యులను పరామర్శించారు, తదుపరినంతరం ఆర్థిక సహాయం అందజేశారు. వారి కుటుంబ సభ్యులందరికీ అండగా ఉంటానని ఎలాంటి ఆపద వచ్చినా తీరుస్తానని అన్నారు. గ్రామంలో రక్తహీనతతో (ఎనీమియా) ఎస్.కె ఉమేరా తబస్సుం (12) బాధపడుతుంది. అమ్మాయి ఆరోగ్యం గురించి తల్లిదండ్రులను తెలుసుకున్నారు, సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షులు మజార్ మొహిద్దిన్ సీనియర్ నాయకులు నకిరేకంటి సైదులు, కౌన్సిలర్ ముత్యాలు, మారేపల్లి గ్రామ ఉపసర్పంచ్ గండికోట సతీష్ నాగార్జునసాగర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ జనరల్ సెక్రెటరీ అనుముల వినయ్ కుమార్, మారపల్లి వార్డు మెంబర్లు సైదులు బరపటి, నక్క నాగయ్యగండు యాదయ్య, గండు శంకర్ గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.